# రైతాంగానికి మద్దతునివ్వని 'మద్దతు' ధరలు

**2019-20** సంవత్సరానికి వివిధ పంటలకు కేంద్రప్రభుత్వం మద్దతు ధరలను ప్రకటించింది. ఎప్పటిలాగానే ఈ ధరలవలన రైతాంగానికి ఉపయోగంలేదు. ప్రభుత్వ రైతాంగ వ్యతిరేక విధానాలకు మద్దతు ధరలు అద్దం పడుతున్నాయి.

2020 నాటికి రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తానని మోడి ప్రభుత్వం చెప్పే మాటలకు, ప్రకటించిన మద్దతు ధరలకు పొంతనే లేదు. ఇలాంటి మద్దతు ధరలతో రైతుల ఆదాయం రెట్టింపు ఎలా సాధ్యం? పంట ఖర్చులను వాస్తవంగా లెక్కించకుండా, దాన్ని కుదించి ఉత్పత్తి ఖర్చును తగ్గించి, మద్దతు ధరను దానిపై 50శాతం పెంచామని కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి నరేంద్రసింగ్ త్రోవర్ చెప్పటం వంచన కాదా?

ఎకరా వరి సేద్యానికి పంట ఖర్చులు 25 వేలు, కౌలుఖర్చు 15 వేలు, కుటుంబశ్రమ విలువ 10వేలు కలిపి మొత్తం 50వేల రూపాయలు ఖర్చు అవుతుంది. సగటు దిగుబడి ఎకరాకి 20 క్వింటాళ్ళు. క్వింటా ఉత్పత్తి ఖర్చు 2500 రూ. దీనికి అదనంగా 50% కలిపి మద్దతుధర ప్రకటిస్తే 3750 రూ.గా వుంటుంది. ప్రభుత్వం ఒక్క పంట ఖర్చునే ప్రమాణంగా తీసుకొని క్వింటా ఉత్పత్తి ఖర్చును 1250 ప్రకటించి దానికి 50% పెంచి 1835 రూ. మద్దతు ధరను ప్రకటించింది. ఇలా ప్రకటించట మంటే కౌలుఖర్చును, కుటుంబ శ్రమవిలువను గుర్తించ నిరాకరించటమే. స్వామినాథన్ కమిటీ సిఫార్సుల్లోను సేద్యపు ఖర్చుల్లో కౌలుఖర్చును చేర్చలేదు. పంట ఖర్చులతోపాటు, కుటుంబ శ్రమను మాత్రమే చేర్చింది. ఆ లెక్కన క్వింటా ఉత్పత్తి ఖర్చు 1,750రూ. యాభైశాతం అదనంగా కలిపితే 2,625 రూ.మద్దతు ధర వుంటుంది. ప్రభుత్వం స్వామినాథన్ సిఫార్సులను కూడా ప్రక్కనపెట్టింది.

దేశంలోనూ, రాష్ట్రాల్లో అధికంగా కౌలు రైతులే సేద్యంలో వున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో 60శాతం దాకా వీరే వున్నారు. చాలా ప్రాంతాల్లో భూయజమానికి ముందుగానే కౌలుడబ్బులు చెల్లించాలి. పేదలు, రైతులు వ్యవసాయ కూలీలుగా, మధ్యతరగతి రైతులు పేదరైతులుగా మారారు. అందుకు నూతన ఆర్థిక విధానాలే కారణం. సంపన్నవర్గాల, భూస్వాముల వద్ద భూమి కేంద్రీకరణ పెరిగింది. భూమి హీనులు ఎక్కువ కావటంతో కౌలుభూమికోసం పోటీ పెరిగి కౌలు రేట్లు పెరుగుతున్నాయి. సొంత భూమిలేని వారు ఉపాధికోసం కౌలుసేద్యాన్ని ఎంచుకొన్నారు. కౌలు చెల్లింపుకి అధిక వడ్డీలకు అప్పులు చేస్తున్నారు. కుటుంబం మొత్తం పొలంలోనే పనిచేస్తారు. ఇలాంటి స్థితిలో వున్న కౌలురైతులను ప్రభుత్వం, స్వామినాథన్ కమీషన్ పట్టించుకోలేదు. సేద్యపు ఖర్చులో వారి కౌలు ఖర్చును పరిగణలోకి తీసుకోలేదు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరలు వలన వారు పెట్టిన పెట్టుబడి కూడా రాక అప్పుల పాలౌతున్నారు. సొంతభూమి రైతుకి కూడా కుటుంబ శ్రమ విలువ ఆదాయం కూడా మిగలదు. స్వామినాథన్ సిఫార్సుల ప్రకారం మద్దతు ధరలు ప్రకటించినా కౌలురైతుకు ఏమీ మిగలదు. కొన్ని ప్రాంతాల్లో సగటు దిగుబడికన్నా ఎక్కువ దిగుబడిని చూపెట్టి, రైతుల ఆదాయాన్ని ఎక్కువచేసి పాలకులు, వారి ఏజెంట్లు చూపటం వంచనతో కూడిందే.

ప్రభుత్వం తాను ప్రకటించిన మద్దతు ధరలైనా రైతులకు అందేటట్లు చేస్తుందా అంటే అదీ జరగటంలేదు. మద్దతు ధరలను ప్రకటించిన ప్రభుత్వం ఆ ధరలు బహిరంగ మార్కెట్‌లో లభించేలా చేయటం, అలా లభించకుంటే ప్రభుత్వ సంస్థలచేత కొనుగోలు చేయించే బాధ్యత తీసుకోవాలి. పాలకులు అటువంటి బాధ్యతను ఇప్పటివరకు చేపట్టలేదు. మద్దతు ధరల ప్రకటనతో తన బాధ్యత తీరినట్లు ప్రభుత్వం వ్యవహరిస్తున్నది. రాష్ట్రప్రభుత్వం నామమాత్రపు కొనుగోళ్ళకే పరిమితమైంది. భారత ఆహారసంస్థ రైతుల నుండి ధాన్య సేకరణను విరమించుకొంది. ఇలాంటపుడు మద్దతు ధరల ప్రయోజనం ఏమిటి అన్న ప్రశ్న రాక మానదు.

సేద్యానికి అవసరమైన ఎరువులు, విత్తనాలు, క్రిమిసంహారక మందులు, డీజిల్ ధరలు నిరంతరం పెరుగుతూ రైతులకు సేద్యపు ఖర్చులు భారంగా మారాయి. కొద్దిరోజుల క్రితమే ప్రతి ఎరువుపైనా బస్తాకి 100 నుండి 120 రూ.వరకు ధర పెరిగింది. పురుగు మందులు, డీజిల్ ధరలు పెరిగాయి. వీటి పెరుగుదల వలన ఎకరా సేద్యానికి వెయ్యి రూపాయలకు పైగా రైతులకు పంట ఖర్చు పెరిగింది. పెరిగిన పంట ఖర్చును గమనిస్తే ప్రభుత్వం పంటలకు పెంచిన మద్దతు ధరలు ఎందుకూ కొరగావు.

కౌలుఖర్చు, కుటుంబ శ్రమవిలువ, పంట ఖర్చును కలిపి సేద్యపు ఖర్చుగా లెక్కించి దానికి అదనంగా 50శాతం పెంచి మద్దతు ధరలను ప్రకటించాలి. రైతులవద్ద వున్న పంటలకు బహిరంగ మార్కెట్‌లో మద్దతు లభించేలా చేయటం లేదా ప్రభుత్వ సంస్థలే కొనుగోలు చేసేలా ప్రభుత్వమే బాధ్యత వహించాలి. ఎరువులు, విత్తనాల ధరలను నియంత్రించాలి. అప్పుడు మాత్రమే రైతులకు మద్దతు ధరల ప్రయోజనం వుంటుంది. ఈ ప్రయోజనాల సాధనదిశలో రైతాంగం ఉద్యమించాలి.

ooo